

నేడు యథావిధిగా పిజిఆర్ఎస్

ప్రజాశక్తి - అమలాపురం

స్థానిక కలెక్టరేట్లోని గోదావరి భవన్ నందు ఈ నెల 11వ తేదీన సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహిస్తారని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పిజిఆర్ఎస్ కార్యక్రమం ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమవుతుందని ఆయన తెలిపారు. అదే విధంగా డివిజన్ మునిసిపల్ మండల స్థాయిలలో పిజిఆర్ఎస్ కార్యక్రమాలు నిర్వహిస్తారని పేర్కొన్నారు అర్జీదారులు ఆ యొక్క స్థాయిలలోని పిజిఆర్ఎస్ సంబంధిత సమస్యలను ఆయా స్థాయి అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కార మార్గాలు కోరాలన్నారు. అర్జీదారులు పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఈ సందర్భంగా కలెక్టర్ కోరారు.

పాఠశాలల్లోకి నో ఎంట్రీ

- విద్యా సంస్థల్లోకి తల్లిదండ్రులు, ఎస్ఎంసి సభ్యులకే అనుమతి
- పార్టీ సంబంధిత లోగోలు, జెండాలతో ప్రవేశించేవారిపై నిషేధం
- విద్యార్థి సంఘాలపైనా ఆంక్షలు
- సర్క్యులర్ జారీ చేసిన కూటమి సర్కారు
- సర్వత్రా విమర్శలు



ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

కూటమి ప్రభుత్వం చర్యలు విద్యార్థులు, ఉపాధ్యాయుల స్వేచ్ఛను, ప్రజాస్వామ్య హక్కులను హరించేలా ఉన్నాయి. పాఠశాలల్లోకి పార్టీలు, ఇతరులెవ్వరూ ప్రవేశించరాదంటూ విడుదల చేసిన సర్క్యులరే దీనికి నిదర్శనం. ఈ సర్క్యులర్ పేరుతో విద్యార్థి సంఘాలను నియంత్రించి వారి గొంతును అణచివేయడానికి సన్నద్ధమైంది. రాజ్యాంగం కల్పించిన విద్యార్థుల హక్కులకు సంకెళ్లు వేస్తూ నిరంకుశ పాలనను కొనసాగిస్తోందని విద్యార్థి సంఘాల నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే ఈ సర్క్యులర్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో మొత్తం 4,396 ప్రభుత్వ పాఠశాలలు, 185 జూనియర్ కాలేజీలు ఉన్నాయి. దాదాపు అన్ని విద్యాసంస్థల్లోనూ సమస్యలు తాండవిస్తున్నాయి. అరకొర వసతులు, సమస్యల మధ్యనే విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఈ సమస్యలపై విద్యార్థి సంఘాలు పలుమార్లు రోడ్డెక్కిన ఘటనలున్నాయి. ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాలు, పాఠశాలల్లో వసతుల లేమిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు గతనెలనే విద్యార్థి సంఘాల ప్రయత్నించాయి. ఈ నేపథ్యంలో పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లలోకి విద్యార్థి సంఘాలకు, ఇతర పార్టీల నాయకులు ఎంట్రీ ఇవ్వొద్దంటూ సర్కారు విడుదల చేసిన సర్క్యులర్‌పై పలు విమర్శలు వినిపిస్తున్నాయి. విద్యార్థి సంఘాలపై కక్ష పూరితంగానే ఈ సర్క్యులర్ విడుదల చేసిందని విద్యావేత్తలు, విద్యార్థి సంఘాల నేతలు అంటున్నారు. విద్యను వ్యాపారంగా మార్చడం, వసతి గృహాల్లో నాసిరకమైన వసతులు, పలు సమస్యలు ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్లు, అధిక ఫీజుల వసూలు, అధిక ధరలకు పుస్తకాలు అమ్మడంపై విద్యార్థి సంఘాలు ప్రశ్నించి ఆందోళనా కార్యక్రమాలను చేపట్టాయి. దీంతో ప్రభుత్వం మరో సారి జూనియర్ కళాశాలల్లోకి సైతం విద్యార్థి సంఘాలకు అనుమతి లేదంటూ తేల్చి చెప్పింది. ఇటువంటి విధానాలు రాజ్యాంగం విరుద్ధమని ప్రజా, విద్యార్థి సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

ఉత్తర్వులు తక్షణం రద్దు చేయాలి

విద్యార్థుల హక్కులను హరించే ఉత్తర్వులను తక్షణమే కూటమి ప్రభుత్వం రద్దు చేయాలి. ప్రభుత్వ విద్యావ్యవస్థను నిర్వీర్యం చేసే కుట్ర జరుగుతోంది. ఇచ్చిన హామీల అమలుకు విద్యార్థి సంఘాలు చేస్తున్న ఆందోళనలపై ప్రభుత్వం బాధ్యతాయుతంగా స్పందించాలి. రాజకీయ పార్టీలకు, విద్యార్థి సంఘాలకు వ్యత్యాసం ఉంది. వాటిని ఒకే గాటన కట్టడం సమంజసం కాదు. విద్యా సంస్థల్లోకి విద్యార్థి సంఘాలకు అనుమతులు లేవంటూ సర్క్యులర్ జారీ చేయడం దుర్మార్గం.

- గంగా సూరిబాబు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి, కాకినాడ జిల్లా

ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడంలో క్రియాశీల పాత్ర

ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ప్రభుత్వ విద్యాసంస్థల రక్షణలో విద్యార్థి సంఘాలు కీలకపాత్ర పోషిస్తున్నాయి. విద్యారంగంలోని సమస్యల పరిష్కారం కోసం, విద్యార్థుల హక్కుల కోసం పోరాడటమే కాకుండా విద్యార్థుల్లో సామాజిక చైతన్యాన్ని పెంపొందిస్తున్నాయి. నాయకత్వ లక్షణాలు, సామాజిక అవగాహనను, హక్కులను, బాధ్యతలను నేర్పిస్తున్నాయి .1950-60లలో రాష్ట్రంలో విద్యా వ్యవస్థ అభివద్ధి దిశగా ప్రయాణం మొదలుపెట్టింది. పల్లెల్లో విద్యావకాశాలు పరిమితంగానే ఉండేవి. ఉన్నత విద్య ప్రధానంగా పట్టణాల్లోనే లభించేది. పేద, మధ్యతరగతి విద్యార్థులు చదువు కొనసాగించడానికి ఎన్నో అడ్డంకులు ఎదుర్కొన్నారు. ఫీజులు, హాస్టల్ సౌకర్యాల లేమి, పాఠ్య పుస్తకాల కొరత, ఉపాధ్యాయుల కొరత వంటి వాటితో సమస్యలు వచ్చాయి. ఈ సమయంలో, విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడానికి, యువతను ఒక వేదికపైకి తీసుకురావడానికి విద్యార్థి సంఘాలు ఏర్పడ్డాయి. తొలుత ఇవి కళాశాలలలో చిన్న గ్రూపులుగా మొదలై, తరువాత జిల్లా, రాష్ట్ర స్థాయికి విస్తరించాయి. అటువంటి ప్రశ్నించే పోరాడే శక్తులను నిలువరించడం వెనుక రాష్ట్ర ప్రభుత్వం తీరు విమర్శలపాలవుతోంది. విద్యారిర్థ సంఘాలను అణచివేయటం ద్వారా విద్యార్థుల్లో సామాజిక చైతన్యం లేకుండా చేయాలనే ఉద్దేశాలు స్పష్టంగా స్పష్టంగా కనిపిస్తున్నాయి.

నాణ్యమైన విద్య కోసం విద్యార్థి సంఘాల పాత్ర

విద్యా సదుపాయాల విస్తరణ: పల్లెల్లో కూడా హైస్కూల్లు, జూనియర్ కాలేజీలు, డిగ్రీ కళాశాలలు రావడానికి విద్యార్థి ఉద్యమాలు పెద్ద పాత్ర పోషించాయి.1990 దశకం తర్వాత ఏర్పడిన ప్రైవేట్ పాఠశాలలు, కాలేజీలలోఫీజుల తగ్గింపు, పేదలకు సబ్సిడీలు,, వెనుకబడిన వర్గాల విద్యార్థులకు స్కాలర్షిప్‌లు, హాస్టల్ సౌకర్యాలు అందించడంలో విద్యార్థి సంఘాల కషి విశేషం.ఉపాధ్యాయుల నియామకం, మౌలిక వసతులు: ఉపాధ్యాయుల కొరత తీర్చడం, లైబ్రరీలు, ప్రయోగశాలలు ఏర్పాటు చేయడంలో విద్యార్థి ఉద్యమాల ఒత్తిడి కీలకం.విద్యలో సమాన అవకాశాలు: కేవలం పట్టణ విద్యార్థులే కాకుండా, గ్రామీణ, గిరిజన, మైనారిటీ విద్యార్థులకు కూడా నాణ్యమైన విద్య లభించేలా విశేష కృషిచేశాయి.

మహిళల ఉచిత బస్సు ప్రయాణానికి ఏర్పాట్లు

ప్రజాశక్తి - రామచంద్రపురం

ఆర్‌టిసి బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ పథకం ఈ నెల 15వ తేదీ నుంచి అమలులోకి రానుంది. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న మహిళల ఉచిత బస్సు ప్రయాణం ఆగస్టు 15వ తేదీ నుంచి ప్రారంభించనుంది. దీనికి రామచంద్రపురం డిపో నుంచి మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కొరకు ఎపిఎస్ఆర్‌టిసి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు డిపో మేనేజర్ తెలిపారు. రామచంద్రపురం డిపోలో ప్రతిరోజు 52 బస్సులతో 18238 కిలోమీటర్లు నేల తిరుగుతున్నవి వీటిలో. 47 బస్సులు అంటే 90 శాతం బస్సులతో మహిళలు ఉచిత ప్రయాణం చేయవచ్చన్నారు. మహిళలకు ఉచిత ప్రయాణం ప్రారంభం దష్టిలో పెట్టుకొని బస్సులు మెరుగైన కండిషన్ కొరకు ప్రతిరోజు షెడ్యూల్ మెయింటినెన్స్ తర్వాత బస్సులను డిఎం, సూపరిండెంట్, మెకానిక్ బస్సును రోడ్డు టెస్ట్‌లు తీసుకుని వెళ్లి బస్సు కండిషన్ పరిశీలించి బాగున్నట్లయితేనే బస్సును ప్రయాణాలకు అనుమతిస్తామని డిపో మేనేజర్ తెలిపారు. అయితే ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రయాణం చేసే మహిళలు ఈ నిబంధనలను పాటించాలన్నారు. ఆంధ్రప్రదేశ్ మహిళలు మాత్రమే ఉచిత ప్రయాణానికి అర్హులని, బస్సు ఎక్కేముందు ఆధార కార్డు, లేదా ఎన్నికల గుర్తింపు కార్డు తీసుకురావలసి ఉంటుంది. రాష్ట్ర వ్యాప్తంగా ఉచిత ప్రయాణం చేయవచ్చన్నారు. మహిళలకు ప్రత్యేక బస్సులు ఉండవు. ఆర్‌టిసి పల్లె వెలుగు, ఆల్ట్రా పల్లె వెలుగు ఎక్స్ప్రెస్ సర్వీసులు, సిటీ సర్వీసు మెట్రో సర్వీసు మొదలైన బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణం చేయవచ్చునని డిపో మేనేజర్ వివరించారు.



ఆర్‌టిసి పల్లె వెలుగు బస్సు

పరిమితికి మించి ఆటోల్లో ప్రయాణం

చర్యలు చేపట్టిన ఆర్‌టిఒ అధికారులు, పోలీసులు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

ఆటోలో అధికారులు సూచించినట్టుగా ప్రయాణం చేయవలసి ఉండగా 15 మంది వరకు ఆటోలో ప్రయాణం చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఆటోలో ప్రయాణిస్తున్న నియంత్రించవలసిన ఆర్‌టిఒ అధికారులు పట్టించుకోకపోవడంతో ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకొని ప్రయాణం చేస్తున్నారు. డ్రైవర్‌కు ఇరువైపులా ఆటో వెనకాల ప్రమాదకరంగా ఆటోలలో ప్రయాణం ప్రమాదకరం అని తెలిసిన ప్రయాణికులు త్వరగా గమ్యం చేరాలని ఉద్దేశంతో ప్రయాణం చేయడంతో ప్రతిరోజు ఏదో సమయంలో ఆటోలు ప్రమాదానిక గురై ప్రయాణికులు గాయాల పాలవుతున్నారు. వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి రాజమహేంద్రవరం, తాడేపల్లిగూడెం, తణుకు, అమలాపురం, కాకినాడ, అన్నవరం ఉమ్మడి జిల్లాలోని పలు గ్రామాలనుండి దర్శనం కోసం ఆటోలో పరిమితికి మించి ప్రయాణం చేయడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దీనిని నియంత్రించవలసిన ఆర్‌టిఒ అధికారులు, పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో రోజు రోజుకి ఆటోల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. దీని నియంత్రించాల్సిన అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడతో ప్రమాదాల సంఖ్య పెరుగుతుంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు కలగజేసుకొని నిబంధన ప్రకారం ఆటోలో ప్రయాణించేలా చర్యలు తీసుకుని ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటారని పలువురు కోరుకుంటున్నారు.


పరిమితకు మించి ఆటోలో ప్రయాణికులు


స్వాధీనం చేసుకున్న వాహనాలతో పోలీసులు

అసాంఘిక కార్యకలాపాలపై దాడులు

ప్రజాశక్తి - ఆలమూరు

డిఎస్‌పి సుంకర మురళీమోహన్ ఆధ్వర్యంలో సిఐ సిహెచ్.విద్యాసాగర్ పర్యవేక్షణలో అసాంఘిక కార్యకలాపాలపై మూకుమ్మడి సమన్వయ దాడులు నిర్వహిస్తున్నట్లు ఆలమూరు ఎస్ఐ జి.నరేష్, ఆత్రేయపురం ఎస్ఐ రాము, కొత్తపేట ఎస్ఐ సురేంద్ర అన్నారు. ఆదివారం ఉదయం 5 నుంచి 8 గంటల వరకు జొన్నాడ తారకరామా కాలనీ లో అసాంఘిక శక్తులను గుర్తించడం కోసం నాలుగు వైపుల నుంచి ప్రత్యేక దాడులు వారు నిర్వహించారు. ఈ దాడులలో రికార్డులు లేని 25 బైకులు, నాలుగు కార్లు గుర్తించి వాటిని స్టేషన్‌కి తరలించారు. పోలీసులు మాట్లాడుతూ ఈ కార్డెన్ సెర్చ్‌లో ఏ ఒక్కరు తప్పించుకోకుండా ఏరియల్ సర్వే కోసం డ్రోన్ కెమెరాలను వినియోగించామన్నారు. అలాగే ఈ దాడులలో అనధికారికంగా కలిగినట్లు గుర్తించిన వాహనాలకు సంబంధిత యజమానులు రికార్డులు అందజేసినట్లయితే వారికి వాహనాన్ని తిరిగి ఇస్తామని అన్నారు. లేనిపక్షంలో మొత్తం వాహనాలను సీజ్ చేసి రికార్డులను ఉన్నతాధికారులకు నివేదిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ సూర్యచంద్రరావు, 25 మంది పోలీసులు పాల్గొన్నారు.

ఘనంగా యుటిఎఫ్ ఆవిర్భావ దినోత్సవం


అమలాపురంలో యుటిఎఫ్ ఆవివర్భా వేడుకల్లో మాజీ ఎంఎల్‌సి ఐవి

ప్రజాశక్తి - యంత్రాంగం

యుటిఎఫ్ 52వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ నాయకులు జెండాలను ఆవిష్కరించారు. **అమలాపురం:** యుటిఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అమలాపురం యుటిఎఫ్ జిల్లా కార్యాలయం నందు యుటిఎఫ్ జెండాని యుటిఎఫ్ జిల్లా అసోసియేట్ అధ్యక్షులు జివి.రమణ ఎగుర వేశారు. ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎంఎల్‌సి, జెఎసి నాయకులు ఐవి మాట్లాడుతూ 1974 ఆగస్టు 10న ఆవిర్భవించిన యుటిఎఫ్ తన పోరాట పంథాల ద్వారా ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు ఎన్నో హక్కులు, రాయితీలు సాధించటంలో కీలకపాత్ర పోషించిందని అన్నారు. నేడు ప్రభుత్వాలు యాప్‌లు, ఇతర బోధ నేతర పనులతో విద్యార్థుల యొక్క బోధన సమయాన్ని హరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులకు బోధ నేతరా పనులు తగ్గించి పాఠశాలలో విద్యార్థులకు చక్కని విద్యను అందించే వాతావరణం కల్పించాలన్నారు. యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు పివిఆర్ మాట్లాడుతూ ఉద్యోగులకు ఉపాధ్యాయులకు రావలసిన డిఎలను వెంటనే ప్రకటించాలని వారికి చెల్లించాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పెన్నాడ శ్రీనివాస్, దుర్గాప్రసాద్, కె.శ్రీనివాస్, చంద్రకళ, సీనియర్ నాయకులు దంగుడు బియ్యం శ్రీరామమూర్తి, గుబ్బల గోపాలకృష్ణ, రూరల్ అధ్యక్షులు చంద్రరావు ప్రధాన కార్యదర్శి కెఎన్‌వి.గౌడ్, కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేశ్వర్లు, బిఎన్.వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **మామిడికుదురు:** మండల రిసోర్స్ సెంటర్ వద్ద యుటిఎఫ్ పతాకాన్ని సీనియర్ నాయకులు కుడుపూడి సత్యనారాయణ ఆవిష్కరించి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఎంఇఒ లక్ష్మీ నారాయణ ముఖ్య అతిథిగా హాజరై సందేశాన్ని ఇచ్చారు జిల్లా కోశాధికారి సిహెచ్.కేశవరావు మాట్లాడుతూ యుటిఎఫ్ ఆవశ్యకతను వివరించారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకునే పోరాట కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. మండల శాఖ అధ్యక్షులు జి.నాగేంద్ర ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బి.పెద్దిరాజు నాయకత్వం వహించగా, సీనియర్ నాయకులు ఆర్.నాగేశ్వరావు, వై.నాగేశ్వరరావు, మొహిద్దిన్, కె.అరుణ జ్యోతి, ఎన్ వరలక్ష్మి, ఆర్.శ్రీనివాసరావు, వైఎస్ ఆర్‌వి.అప్పారావు, రామ్‌కుమార్, అరవ సుబ్రహ్మణ్యం, అప్పన కొండయ్య, పిఎస్ సాయిబాబు, సూరిమేని శ్రీనివాస్, కెవి వి.సత్యనారాయణ హాజరయ్యారు. **ఆలమూరు:** యుటిఎఫ్ ఆవిర్భావ దినోత్సవం మండల కేంద్రంలో యుటిఎఫ్ హోం నందు యుటిఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా నేతల అంతా యుటిఎఫ్ జెండాను ఆవిష్కరించి, ఉద్యమ నినాదాలు చేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ మండల అధ్యక్షులు అద్దరి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి బొంతు లోకేష్, సీనియర్ నాయకులు వైవివి.రమణ, పివివి జిఎస్ఎన్.మూర్తి, దాసరి నాగేశ్వరరావు, నాగులకొండ శ్రీనివాసరావు, ఈదర రమేష్, రిటైర్ ఉపాధ్యాయులు సుధాకరరావు పాల్గొన్నారు. **ఆత్రేయపురం:** స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో యుటిఎఫ్ ఆవిర్భావాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా యుటిఎఫ్ ఆడిట్ కమిటీ కన్వీనర్ కొప్పిశెట్టి శ్రీనివాస్ పతాకావిష్కరణ చేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ మండల శాఖ అధ్యక్షులు టి.రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి సిహెచ్.సుధాకర బాబు, గౌరవ అధ్యక్షులు సరిదే ప్రసాద్, కోశాధికారి కడలి ప్రసాద్, సహాధ్యక్షురాలు డిడి లక్ష్మీదేవి, జిల్లా కౌన్సిలర్లు చిప్పాడ సత్యనారాయణ, సిహెచ్‌విఎల్‌కె.దుర్గ, కార్యవర్గ సభ్యులు కారింకి ప్రసాద్, సానబోయిన సాయిరాం, బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. **అయినవిల్లి:** స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద యుటిఎఫ్ వార్షికోత్సవాన్ని మండల యుటిఎఫ్ నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించారు. యుటిఎఫ్ పతాకాన్ని సీనియర్ ఉపాధ్యాయులు పివి.సూర్య నారాయణమూర్తి ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ యుటిఎఫ్ సభ్యత్వం లక్ష దాటి రాష్ట్రం లోనే అతిపెద్ద ఏకైక సంఘంగా నిలిచి చరిత్ర సృష్టించిందన్నారు. అనంతరం ఫోన్ డైరీని ఆవిష్కరించి ఉపాధ్యాయులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండలశాఖ గౌరవఅధ్యక్షులు జి. సాయి శ్రీనివాస్, అధ్యక్షులు టి.బి. ఈశ్వరరావు, సెక్రటరీ బి .సందీప్ జిల్లా కార్యదర్శి పి.మురు గేశ్వరరావు, సంక్షేమ పథకం డైరెక్టర్ బి.శ్రీనివాసరావు, జి. గంగాద్రిరావు, జి.బంగార్రాజు,కిరణ్ తేజ తదితరులు పాల్గొన్నారు.. **కపిలేశ్వరపురం:** స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట యుటిఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో రిటైర్డ్ టీచర్లు డివి.రాఘవులు, సిహెచ్ వివి.సత్యనారాయణమూర్తి, కెవి. రమణ, మండల అధ్యక్షులు జె.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఐ.సూరిబాబు, కోశాధికారి జివి.భీమేశ్వరరావు, జిల్లా కౌన్సిలర్ ఎస్ సత్యనారాయణమూర్తి, ఆఫీస్ బేరర్స్, కార్యకర్తలు, పాల్గొన్నారు.


ఆలమూరులో యుటిఎఫ్ హోం నందు జెండా ఆవిష్కరిస్తున్న నేతలు


కపిలేశ్వరపురంలో యుటిఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



మామిడికుదురులో యుటిఎఫ్ ఆవిర్భావ వేడుకలు


ఆత్రేయపురంలో పతాకావిష్కరణచేసిన యుటిఎఫ్ నాయకులు



అయినవిల్లిలో పతకాన్ని ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు


సునీల్ కుమార్‌ను సత్కరిస్తునన పెనికేరు నేతలు

ఎపిపి సునీల్‌కుమార్‌కు పెనికేరు నేతల అభినందన

ప్రజాశక్తి - ఆలమూరు


రామచంద్రపురం 13వ అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్టు అడిషనల్ పిపి గా నియమితులైన కప్పల సునీల్ కుమార్ మండలంలోని పెనికేరుకు చెందిన టిడిపి నేత, పారిశ్రామిక వేత్త ఈదర చినబాబును ఆదివారం మర్యాద పూర్వకంగా కలవగా చినబాబు ఆధ్వర్యంలో కూటమి నేతలతో కలిసి సునీల్‌కుమార్‌ను అభినందించి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా చిన్న బాబు మాట్లాడుతూ అభాగ్యులకు ఉత్తమ సేవలు అందిస్తూ ముందుకు వెళ్లాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సునీల్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం నా మీద ఉంచిన నమ్మకాన్ని వమ్ముకాకుండా ప్రజల ఆకాంక్షను నెరవేర్చేలా నా వృత్తి కొనసాగు తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ మేకా రామన్న(రాంబాబు), టిడిపి గ్రామ అధ్యక్షుడు గొడవర్తి సూర్య భాస్కరరావు, మండల తెలుగు రైతు అధ్యక్షుడు కోన శ్రీనివాస్(దత్తుడు), ఎస్ సెల్ సీనియర్ నేత కొమ్ము నారాయుడు, గోపి గోపాలకష్ణ, కాంద్రేగుల శ్రీనివాస్, గుత్తుల శ్రీకష్ణ, గుడాల ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

స్థానిక శ్రీ వెంకటేశ్వర డిగ్రీ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో నల్లా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల కరస్పాండెంట్ కెవిఆర్.నరసింహారావు, నల్లా పవన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళా ఉదయం 9 గంటల నుంచి ప్రారంభమవుతుందని ప్రిన్సిపల్ కె.మనోహర్ ఈ సందర్భంగా తెలిపారు. ఇంటర్, ఫార్మసీ, మెకానికల్, ఎలక్ట్రికల్ డిప్లమో ఉత్తీర్ణత సాధించిన వారికి అలాగే ఫార్మా టెక్నాలజీలో పాస్ అయిన వారికి ప్రముఖ ఎమ్మెస్ అండ్ లాబరేటరీ హైదరాబాదులో ఉద్యోగ అవకాశాలు కలుగజేసే ఉద్దేశంతో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎంపిక అయిన ఉద్యోగులకు వార్షిక ఆదాయం రూ.2.5 లక్షల నుంచి రూ.3లక్షల వరకు ఉంటుందని తెలిపారు.మరిన్ని వివరాలకు టోల్ ఫ్రీ నెంబర్ 18004198800గాని కళాశాల ఎఒ ప్రవీణ్ 8121114666 లో గాని సంప్రదించాలన్నారు

కార్టూ'నిజం'




నూరు శాతం పూర్తయిన వరి నాట్లు

ముమ్మరంగా కలుపుతీతలు

ప్రజాశక్తి - రామచంద్రపురం

తొలకరి వరి నాట్లు నూరు శాతం పూర్తయ్యాయి. రామచంద్రపురం మండలంలో 17 ఎకరాలలోనూ, కె.గంగవరం మండలంలో 15,56 వేలు ఎకరాల లోను వరి నాట్లు ఆగస్టు మొదటి వారం నాటికి పూర్తయ్యాయని మండల వ్యవసాయ అధికారి టివిఆర్ మణిదీప్ తెలిపారు. ప్రస్తుతం నాట్లు పూర్తయిన వరి చేల్లో ముమ్మరంగా కలుపుతీతలు కొనసాగుతున్నయి. ఈ ఏడాది జూలై మొదటి వారంలోగా నాట్లు పూర్తి చేయాలనుకున్నప్పటికీ ఆలస్యంగా ఆగస్టు మొదటి వారం నాటికి పూర్తయ్యాయి. ఇక వరిలో వచ్చే తెగుళ్ల గురించి, కలుపు తీసిన అనంతరం ఎరువులు యాజమాన్యం గురించి వ్యవసాయ శాఖ అధికారులు ఎప్పటికప్పుడు పొలంబడి కార్యక్రమాల్లో రైతులకు వివరిస్తున్నారు. ఎరువులు పురుగుమందులు రేట్లు అధికంగా ఉండటంతో వ్యవసాయం అంత లాభసాటిగా ఉండటం లేదు. అయినప్పటికీ రైతులు సేద్యం చేస్తూ ధాన్యం పండిస్తున్నారు.. పెరుగుతున్న ధరలతో ఎరువులు పురుగుమందులు వాడకం తగ్గించాలని సేంద్రియ ఎరువుల ఉపయోగించాలని తద్వారా ఆరోగ్యకరమైన పంటలు పండించాలని శాస్త్రవేత్తలు సైతం రైతులకు తెలియజేస్తున్నారు. అయితే దాల్వా పంట కంటే తొలకరి పంటలో ఎరువులు వాడకం కొంత తక్కువగానే ఉంటుంది. ఇప్పటికే కూలి రేట్లు కూడా అధికంగా ఉండటంతో పెట్టుబడులు పెరిగిపోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వరి చేల్లో కలుపు విపరీతంగా ఉండటంతో రైతన్నలు కలుపుతీతలు పనుల లో నిమగ్నమ య్యారు. ప్రస్తుతం వాతావరణం అనుకూలించడంతో సాగునీరు సమృద్ధిగా లభించడంతోపాటు వాతావరణం రైతులకు అనుకూలంగా ఉంది. దీంతో తొలకరి పంటలు ఏపుగా పెరుగుతున్నాయి. నవంబరు మొదటి వారం నాటికి తొలకరి వరి చేలు కోతకు వచ్చే అవకాశం ఉందని రైతన్నలు అంచనా వేస్తున్నారు..


వేగాయమ్మ పేట వద్ద ఏపుగా పెరుగుతున్న తొలకరి వరి చేలు

మండపేటను తూర్పు గోదావరి జిల్లాలో కలపాలి

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

అంగరలో ఆదివారం మండపేట నియోజకవర్గాన్ని తూర్పు గోదావరి జిల్లాలో కలపాలంటూ నియోజకవర్గ అఖిలపక్ష నేతలతో సమావేశం నిర్వహించారు. మండపేట నియోజకవర్గ అఖిలపక్ష కమిటీ ఛైర్మన్ కామన ప్రభాకర రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జడ్‌పిటిసి సభ్యుడు పుట్టపూడి అబ్బు, పుచ్చల శ్రీనివాస్, సర్పంచ్ సాకా శ్రీనివాస్, జె.మల్లికార్జునుడు, డివి. రాఘవులు, బలవ రెడ్డి సత్తిబాబు, అల్లూరి రామకష్ణ చౌదరి, గుడాల జయబాబు, వాద ప్రసాదరావు, దేవు వెంకటరాజు, డి.జయరాజు, తదితర నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ 2006 నియోజకవర్గాల పునర్విభజన సందర్భంగా అసెంబ్లీ నియోజకవర్గంలోని మండలానికి నదులు, కొండలు, అడ్డుగా ఉండరాదని కేంద్ర ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. అందులో భాగంగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కేంద్రం అమలాపురానికి, మండపేట నియోజకవర్గానికి, గోదావరి నది అడ్డుగా ఉన్నప్పటికీ గత వైసిపి ప్రభుత్వం పరిగణలోకి తీసుకోలేదని అన్నారు. ఇప్పటికే మండపేట నియోజకవర్గాన్ని తూర్పు గోదావరి జిల్లాలో కలపాలని కోరుతూ కపిలేశ్వరపురం మండలంలోని మెజార్టీ గ్రామ పంచాయతీలు తీర్మానాలు చేసినట్లు ఈ సందర్భంగా నాయకులు తెలిపారు. అమలాపురం కంటే రాజమహేంద్రవరం అయితే నియోజకవర్గ ప్రజలకు దూర భారాలు తగ్గి అన్ని విధాల అనుకూలంగా ఉంటుందని పలువురు అఖిలపక్ష నేతలు అభిప్రాయాలు వ్యక్తం చేశారు..


అంగర లో అఖిలపక్ష సమావేశంలో పాల్గొన్న నాయకులు

15 నుంచి మహిళలకు ఉచిత బస్ సౌకర్యం



ప్రజాశక్తితో ఆర్‌టిసి రవాణా అధికారి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ పథకాలలో భాగంగా ఈ నెల 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు సర్వీసు ప్రారంభం కానుంది. 'స్త్రీశక్తి' పథకం పేరుతో దీన్ని అమలు చేయనున్నారు. ఈ పథకం కింద రాష్ట్రంలోని ఆడపిల్లలు, మహిళలు, ట్రాన్స్‌జెండర్లకు ఉచితంగా బస్సు ప్రయాణం కల్పించనున్నారు. జిల్లాలో ఈ పథకం అమలు, నిబంధనలపై ఆర్‌టిసి జిల్లా రవాణాధికారి ఎం.శ్రీనివాసరావు వివరించారు.

జిల్లాలో బస్సుల పరిస్థితి ఏమిటి

కాకినాడ జిల్లాలో 304 ఆర్‌టిసి బస్సులు నడుస్తున్నాయి. వీటిల్లో వెన్నెల ఎసి బస్సులు 2, నైట్ రైడర్స్ 2, అమరావతి 4, ఇంద్ర ఎసి బస్సులు 17, స్టార్ లైనర్ 4, సూపర్ లగ్జరీలు 57, అల్ట్రా డీలక్స్ 24, ఎక్స్‌ప్రెస్‌లు 19, అల్ట్రా పల్లె వెలుగు 39, పల్లె వెలుగు బస్సులు 136 ఉండగా ఇవి రోజుకు 1,14,630 కిలోమీటర్లు నడుస్తున్నాయి. సరాసరి రోజుకు సుమారు 80 వేల మంది ప్రయాణిస్తున్నారు. రోజుకి దాదాపు రూ.52 లక్షల వరకూ ఆర్‌టిసికి ఆదాయం సమకూరుతోంది. ఉచిత సర్వీసు వల్ల కుటుంబాపై ఆర్థిక భారం తగ్గుతుంది.

ఉచిత ప్రయాణానికి నిబంధనలు ఏమిటి

రాష్ట్రంలో ఎక్కడికైనా మహిళలు ఉచితంగా ప్రయాణించవచ్చు. ఉచితంగా ప్రయాణించాలనుకునేవారు తమ ఆధార్ కార్డు ఓటర్ ఐడీ, రేషన్‌కార్డు ఏదో ఒకటి చూపించాల్సి ఉంటుంది. లేదా ఏదైనా ఇతర గుర్తింపు కార్డును తప్పనిసరిగా చూపించాలి. భవిష్యత్తులో స్మార్ట్ కార్డులు కూడా ఇచ్చే ఆలోచన ఉన్నట్టు ఉన్నతాధికారులు తెలిపారు.

ఏయే రకాల సర్వీసుల్లో అవకాశం కల్పిస్తారు

ఆర్‌టిసికి చెందిన ఐదు రకాల సర్వీసుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణించవచ్చు. పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, సిటీ ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణించేందుకు అవకాశం ఉంటుంది. ఈ పథకం కింద ప్రయాణించే వారికి జీరో టికెట్ ఇస్తారు. దానిపై ఛార్జీ ఉండదు.

ఉచితం ఏయే బస్సులకు వర్తించదు

ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో కొన్ని ఇంటర్‌స్టేట్ సర్వీసులుగా రాష్ట్రం నుంచి కర్ణాటక, తమిళనాడు, తెలంగాణల్లోని వివిధ ప్రాంతాలకు తిరుగుతున్నాయి. వీటిలో ఉచిత ప్రయాణానిక అవకాశం ఉండదు. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పాడేరు ఘాట్‌లో తిరిగే ఎక్స్‌ప్రెస్ బస్సుల్లోనూ ఉచిత ప్రయాణానికి అనుమతి ఉండదు. వీటిలో ఉచిత ప్రయాణానికి అవకాశమిస్తే బస్సుల్లో రద్దీ ఎక్కువై, ఘాట్‌లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. నాన్‌స్టాప్ ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో కూడా ఉచిత ప్రయాణం ఉండదు.

ఈ పథకం అమలైతే ఆర్‌టిసిపై ఎంత భారం పడుతుంది

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం వల్ల ఆర్‌టిసి సంస్థపై ఆర్థిక భారం పడుతుంది. ఆ భారాన్ని ప్రభుత్వం భరిస్తుంది. పథకం అమలు తర్వాత జిల్లాలో రోజుకి సుమారు రూ.4 లక్షల వరకూ అదనపు భారం ఆర్‌టిసిపై పడే అవకాశం ఉంటుందని అంచనా వేస్తున్నాం. ఉచిత సర్వీసు అందుబాటులోకి వస్తే ప్రయాణాలు చేసే మహిళల సంఖ్య పెరిగే అవకాశం కూడా ఉంటుంది. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులను సిద్ధం చేస్తున్నాం.



నేరాలు ఘోరాలు

పేకాట స్థావరంపై దాడి : ఆరుగురు అరెస్ట్

ప్రజాశక్తి- తాళ్లరేవు

మండలంలోని సుంకరపాలెం ఆర్‌ఆర్ ఇన్ హోటల్లో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై కోరంగి పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ పి.సత్యనారాయణ తెలిపిన వివరాల మేరకు సుంకరపాలెం జంక్షన్‌లో ఆర్‌ఆర్ ఇన్ హోటల్లో చింతలపూడి హర్ష నాగ వర్ధన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై దాడి చేసి ఆరుగురిని అరెస్టు చేశావని అన్నారు. వారి నుంచి రూ.27,600 నగదు, ఏడు మొబైల్ ఫోన్లు, 104 పేక ముక్కలను స్వాధీన పరుచుకున్నట్టు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - నిడదవోలు

పట్టణంలో గణేష్ సెంటర్ జివి షాపింగ్ మాల్ ఎదురుగా సుమారు 55 సంవత్సరాల వయసు గల గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్లు పట్టణ ఎస్ఐ కె.జగన్మోహన్‌రావు తెలిపారు. మృతునికి సంబంధించిన వారు ఎవరైనా ఉంటే నిడదవోలు పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని తెలిపారు. మృతిని వివరాలు తెలిస్తే ఎస్ఐ 9440796660, సిఐ 9440796659 నెంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు.

చెట్టు పైనుంచి పడి దింపు కార్మికుని మృతి

ప్రజాశక్తి - ఆత్రేయపురం

ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి జారి పడి కొబ్బరి దింపు కార్మికుడు మృతి చెందాడు. ఈ సంఘటనపై ఆదివానం పోలీసులు కేసు నమోదు చేశారు. వారి వివరాలు ప్రకారం.. మండలంలోని వసంతవాడ గ్రామానికి చెందిన కారంకి వీర వెంకట సత్యనారాయణ (42) కొబ్బరి దింపు కార్మికునిగా పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ తరుణంలో ఆదివారం ఎప్పటిలాగే రామిరెడ్డి వీరభద్ర అనే రైతు పొలంలో కొబ్బరి దింపు పనికి వెళ్లి కొబ్బరికాయలు దింపు తీస్తుండగా ప్రమాదవశాత్తు సత్యనారాయణ చెట్టుపై నుంచి జారి కిందికి పడిపోయాడు. తీవ్ర గాయాలైన కార్మికుడిని హుటాహుటిన కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో దింపు కార్మికుడు సత్యనారాయణ మృతి చెందాడు. దీనిపై మృతుడు సత్యనారాయణ తమ్ముడు కారంకి నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎస్.రాము తెలిపారు.

కుట్రపూరితంగా ఆస్తి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఫిర్యాదు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

వారసత్వంగా లభించిన ఆస్తిని కొందరు వ్యక్తులు దస్తావేజు లేఖరు సాయంతో కుట్రపూరితంగా, మోసపూరితంగా కాజేయాలని దురుద్దేశంతో కొద్ది రోజుల క్రితం రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని బాధితుడు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపారు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని లంక ఆఫ్ ఠానేలంకకు చెందిన కొప్పిశెట్టి వేణుగోపాల కృష్ణకు 98 సెంట్లు వారసత్వంగా లభించిన భూమి ఉందన్నారు. దానిని తాను, విశ్వేశ్వరరావు పారికత్తులు రాయించుకున్నామని, తమకు ఆ ఆస్తికి సంబంధించి అన్ని ఆధారాలు ఉన్నాయని ఫిర్యాదులో బాధితుడు పేర్కొన్నాడన్నారు.. ఆ ఆస్తిని తమ గ్రామానికి చెందిన ఆరుగురు వ్యక్తులు ముమ్మిడివరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని, దీనిపై విచారణ నిర్వహించి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశాడన్నారు. అతడి ఫిర్యాదు మేరకు ఎస్ఐ డి.జ్వాలా సాగర్ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆస్తి అక్రమ బదిలీపై ఫిర్యాదు

ప్రజాశక్తి - సఖినేటిపల్లి

మండలంలోని సఖినేటిపల్లి గ్రామంలో శాంతినగర్ సంఘ క్రైస్తవ కమ్యూనిటీ హాలు ఆస్తిని అక్రమంగా బదిలీ చేశారంటూ వచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు. రాజోలు నియోజకవర్గానికి చెందిన జనసేన నేత తాడి మోహన్ కుమార్ అయన కుటుంబం సభ్యులపై స్థానిక క్రైస్తవ కమ్యూనిటీ హాల్ ప్రతినిధులు ఇచ్చిన ఫిర్యాదుపై సఖినేటిపల్లి ఎస్ఐ దుర్గ శ్రీనివాస్ కేసు నమోదు చేసినట్లు ఆదివారం విలేకరులకు తెలిపారు. దీనికి సంబంధించి మొత్తం 13 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. రెండు నెలలుగా స్థానిక శాంతినగర్లో కొద్దిపాటి ఘర్షణ వాతావరణం నెలకొంది, ఇరుపక్షాలు పోలీసులకు ఫిర్యాదులు చేసుకున్నారు. అధికారి పార్టీ బలంతో ఒక వర్గంపై మాత్రమే కేసులు నమోదయిందని, దీనికి జనసేన తాడి మోహన్ కుమార్ కారణమని, పార్టీని అడ్డం పెట్టుకుని తమపై వేధింపులు గురి చేస్తున్నారంటూ గత మేలో స్థానిక సంఘస్తులంతా ఆయనపై రాజోలు ఎంఎల్ఎ దేవ వరప్రసాద్ కు సైతం ఫిర్యాదు చేశారని స్థానికులు చెబుతున్నారు. సఖినేటిపల్లి పోలీసులు మధ్యవర్తిత్వం వహించి శాంతి చర్యలు చేపట్టగా, ఆ సమయం కొనసాగుతుండగా జూలై 26న చర్చి పాస్టర్ బర్రె భాగ్యరాజుకు ఆస్తిని బదిలీ చేయడంతో వివాదం తీవ్రమైంది.

రైల్వే స్టేషన్‌లో తప్పిపోయిన బాలిక అప్పగింత

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట రైల్వే స్టేషన్లో తప్పిపోయిన బాలికను పోలీసులు బంధువులకు సురక్షితంగా అప్పగించారు. రైల్వే స్టేషన్‌లో ఆదివారం టికెట్ తీసుకోవడానికి జొన్నాదుల వెంకట సాయమ్మ తన మనవరాలు జ్యోత్స్నతో కలిసికౌంటర్ వద్ద ఉన్న సమయంలో, ప్రయాణికుల రద్దీ కారణంగా బాలిక తప్పిపోయింది. ఒకటో నంబర్ ప్లాట్‌ఫారంపై ఏడుస్తూ తిరుగుతుండడంతో గమనించిన ప్రయాణికులు, ఆమెను స్టేషన్ సూపరింటెండెంట్ అనంతలక్ష్మి వద్దకు తీసుకువెళ్లారు. తర్వాత పబ్లిక్ అనౌన్స్‌మెంట్ ద్వారా సమాచారం ఇవ్వగా, బాలిక అమ్మమ్మ వచ్చి కలుసుకున్నారు. స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్, ఆర్‌పిఎఫ్ సిబ్బంది ఆధ్వర్యంలో జ్యోత్స్నను సురక్షితంగా కుటుంబ సభ్యులకు అప్పగించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - మండపేట

ఏడిద సబ్ స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్ కో రామచంద్రపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రత్నాలరావు తెలిపారు. సబ్‌స్టేషన్లోనూ, పలు గ్రామాల్లోని విద్యుత్ లైన్లకు మరమ్మతు పనులు చేసే నిమిత్తం అంతరాయం ఏర్పడుతుందన్నారు. సబ్‌స్టేషన్ పరిధిలోని ఏడిద, ఏడిద సీతానగరం, ఏడిద కొత్తూరు, ఏడిద సావరం గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు. దీనికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు మాలమహానాడు ఆధ్వర్యంలో మృతులకు నివాళి

ప్రజాశక్తి - అమలాపురం

స్థానిక జిల్లా మాల మహానాడు జెఎసి ఆధ్వర్యంలో నేడు సోమవారం అమలాపురం గడియార స్థంభం సెంటర్ వద్ద మాల మృత వీరులను స్మరించుకుంటూ నివాళులు అర్పిస్తామని నాయకులు ఆదివారం ఒక ప్రకటనలో జిల్లా మాలమహానాడు జిల్లా అధ్యక్షులు జల్లి శ్రీనివాసరావు తెలిపారు. అనంతరం ఏకపక్షంగా ఎస్‌సి వర్గీకరణ చేసి మాలలను విద్య, ఉద్యోగాల్లో అణచి వేయడానికి ప్రయత్నిస్తున్న ప్రభుత్వ విధానాన్ని నిరసిస్తూ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తామన్నారు. అదేవిధంగా మాల కులానికి సంబంధించిన ప్రతీ వ్యక్తి పార్టీ, వర్గ విబేధాలకు తావు లేకుండా హాజరై తమ గళాన్ని వినిపించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో నాతి శ్రీనివాసరావు, గెద్దాడ బుద్ధ రాజు, గెల్లా రాజేంద్ర , బొంతు శ్రీను,మెండి డేవిడ్ అంబేద్కర్, సాపే రమేష్, మరియు మాలమహానాడు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫైలేరియా నిర్మూలనకు నైట్ క్లినిక్‌ల ఏర్పాటు

ప్రజాశక్తి - అమలాపురం

ఫైలేరియా నిర్మూలనకు కొంకాపల్లి మున్సిపల్ హైస్కూల్ వెనుక రోడ్డులో ఎవి ఆర్ నగర్ సచివాలయం పక్కన ఉన్న ఎన్ఎఫ్‌సిపి (ఫైలేరియా ఆఫీసు) నందు ప్రతి మంగళవారం సాయంత్రం 6 గంటల నుంచి 10 గంటల వరకు నైట్ క్లినిక్ నిర్వహిస్తున్నామని హెల్త్ ఇన్స్పెక్టర్ ప్రసాదరావు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఫైలేరియా (బోధవ్యాధి) అని అనుమానం కలిగిన వారు లేదా వ్యాధితో బాధపడుతున్న వారు ప్రభుత్వం కల్పిస్తున్న ఈ సేవలను ఉపయోగించుకోవాలన్నారు. ఉచితంగా రక్త పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేస్తామన్నారు. ఫైలేరియా వ్యాధి అనుమానితులు ప్రతి మంగళవారం ప్రభుత్వం వారు నిర్వహిస్తున్న ఈ నైట్ క్లినిక్ ని ఉపయోగించుకోవాలని కోరారు.

12న ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి - మండపేట

. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఈ నెల 12న ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టికెవి.శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించే వైద్య శిబిరంలో రాజమహేంద్రవరానికి చెందిన శ్రీకర మల్టీస్పెషాలిటీస్ హాస్పటల్, గౌతమి నేత్రాలయం, డాక్టర్ మోహన్స్ డయాబెటిస్, రమా దంత వైద్యశాల నిపుణులు వైద్య సేవలు అందిస్తారన్నారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో బిపి., షుగర్ సంబంధించి పరీక్షలు, గుండెకు సంబంధించి పరీక్షలు, ఇసిజి పరీక్షలు, పొట్టకు సంబంధించి పరీక్షలు, (గ్యాస్ట్రిక్ సమస్యలు), ఎముకులకు సంబంధించి, దంత పరీక్షలు, మహిళలకు సంబంధించిన వ్యాధులు, కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. అనంతరం రోగులకు ఉచితంగా మందులు, అవసరమైన వారికి కళ్ళద్దాలు అందజేస్తారన్నారు. ఈ అవకాశాన్ని మండపేట పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు .




మెట్టపాలెంలో వాహనాలు తనిఖీ నిర్వహిస్తున్న సిఐ భీమరాజు, ఎస్ఐ, సిబ్బంది

రికార్డులు లేని 20 వాహనాల స్వాధీనం

ప్రజాశక్తి - అంబాజీపేట

మాచవరం గ్రామం మెట్ల కాలనీలో ఆదివారం తెల్లవారుజామున పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కొత్తపేట డిఎస్‌పి పి.సుంకర మురళీమోహన్ ఆధ్వర్యంలో పి.గన్నవరం సిఐ రుద్రరాజు భీమరాజు పర్యవేక్షణలో 25 మంది సిబ్బందితో తనిఖీలు చేపట్టారు. తనిఖీలలో రికార్డులు లేని 20 వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. సరైన పత్రాలు చూపిస్తే వాహనాలను తిరిగి ఇస్తామని లేకపోతే బ్రేక్ ఇన్స్పెక్టర్‌కు స్వాధీన చేస్తామని సీఐ భీమరాజు స్పష్టం చేశారు. గంజాయి, సారాయి, వంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించేందుకు మారుమూల గ్రామాలలో తరచూ ఆకస్మిక తనిఖీలు కొనసాగిస్తామన్నారు. ఈ తనిఖీలలో ఎస్ఐ కె.చిరంజీవి, ట్రైనింగ్ ఎస్ఐ జి. సోమేంద్ర తో పాటు ఏఎస్ఐ లు, హెచ్ సి లు, కానిస్టేబుల్ లు పాల్గొన్నారు.



మృతుడు నాగరాజు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంఎల్ఎ ఆనందరావు, నాయకులు

మృతుని కుటుంబానికి ఎంఎల్ఎ పరామర్శ

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

వానపల్లిపాలెంకు చెందిన దోనిపాటి నాగరాజు హైదరాబాద్‌లో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించాడు. మృతుని కుటుంబాన్ని ఆదివారం ఎంఎల్ఎ అయితాబత్తుల ఆనందరావు, నాయకులు పరామర్శించారు. నాగరాజు చిత్రపటానికి ఎంఎల్ఎ ఆనందరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాగరాజు కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. పరామర్శించిన వారిలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్, జిల్లా అధ్యక్షులు దేశంశెట్టి లక్ష్మీనారాయణ, సహకార సొసైటీ ఛైర్మన్ మట్టా మహాలక్ష్మి, ప్రభాకర్, నాయకులు ఉన్నారు.

స్నేహితుని కుటుంబానికి పూర్వ విద్యార్థుల సాయం

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం



రూ. లక్ష సాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

ఇటీవల మృతి చెందిన స్నేహితుని కుటుంబాని పూర్వ విద్యార్థులు రూ.లక్ష ఆర్థిక సాయం అందజేశారు. వివరాలు ఇవి..గొల్లవిల్లి జడ్‌పి ఉన్నత పాఠశాలలో 1997-98 పదో తరగతి బ్యాచ్‌కి చెందిన పూర్వ విద్యార్థి గొల్లవిల్లి పంచాయతీ వాడపర్రుకు చెందిన అరవ వీరవెంకటరమణ సత్యనారాయణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. తమ మిత్రుడు వీర వెంకటరమణ సత్యనారాయణ పై ఆధారపడిన వృద్ధాప్యంలో ఉన్న అతని తల్లిదండ్రులు, భార్య, కుమారుడు, కుమార్తె పేదరికంతో ఇబ్బందులు పడుతున్నారని ఆ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు తెలుసుకున్నారు. తమ వంతుగా ఆ కుటుంబానికి సహాయం అందించాలనుకుని నిర్ణయం తీసుకున్నారు. మృతుడు వీర వెంకటరమణ సత్యనారాయణ భార్య, కుమారుడు, కుమార్తెకు వారి ఇంటి వద్ద వాడపర్రులో తమ వంతు సహాయంగా రూ.లక్ష ఆర్థిక సాయం అందించి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు .ఈ సందర్భంగా బాధిత కుటుంబం పూర్వ విద్యార్థులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కోడూరి పల్లంరాజు, నాగిరెడ్డి రాంబాబు, మారిశెట్టి నాగ కృష్ణమూర్తి, సలాది తాతారావు, గనిశెట్టి చిరంజీవి, ఆదివారపుపేట చిన్నారావు, బొంతు చిట్టిబాబు, పాలకొల్లు సుబ్రహ్మణ్యం, బిక్కిన ఏసుబాబు, గుత్తుల రాజు, మారిశెట్టి దుర్గారావు, చిప్పాడ ప్రసన్న, జిన్నూరి నాగబాబు పాల్గొన్నారు.

మరిడమ్మ ఆలయంలో అన్నదానం ప్రారంభం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మరిడమ్మ అమ్మవారి ఆలయంలో ఆదివారం అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే యాత్రికులకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రతి ఆదివారం సుదూర ప్రాంతాల నుండి అమ్మవారిని దర్శించుకునేందుకు యాత్రికులకు గతంలో ఆలయంలో అన్నదానం నిర్వహించేవారమన్నారు. జూన్ 24వ తేదీ నుండి జూలై 31వ తేదీ వరకు వైభవంగా జరిగిన మరిడమ్మ అమ్మవారి జాతర సందర్భంగా ఆలయంలో ఆదివారం జరిగే అన్నదాన కార్యక్రమాన్ని తాత్కాలికంగా నిలిపివేశామన్నారు. ఈ ఆదివారం నుంచి అన్నదాన కార్యక్రమాన్ని పున్హ ప్రారంభించామన్నారు. ఈ అన్నదాన కార్యక్రమంలో వేద పండితులు ఐవి.ప్రసాద్ శర్మ, ఎన్ వి.అవధాని, శంకర్, ఆసాదులు రాయి నాని, రామచంద్ర ప్రసాద్, సిబ్బంది ఎస్.రమణ, జి.క్రాంతి, వరహాలు, శివ సేవలందించారు.

మరిడమ్మను దర్శించుకున్న చాగంటి

ప్రజాశక్తి - పెద్దాపురం

ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు ఆదివారం స్థానిక మరిడమ్మ అమ్మవారిని కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజలు అనంతరం వారికి అమ్మవారి తీర్థ ప్రసాదాలను, అమ్మవారి చిత్రపటాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వేద పండితులు ఐవి.ప్రసాద్‌శర్మ, ఎన్‌వి.అవధాని, శంకర్, ఆసాదులు రాయి నాని, రామచంద్ర ప్రసాద్, సిబ్బంది ఎస్.రమణ, జి.క్రాంతి, వరహాలు, శివ పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి దాతల విరాళాలు

ప్రజాశక్తి - మామిడికుదురు

అప్పనపల్లి బాల బాలాజీ స్వామి ఆలయములో నిర్వహించే శాశ్వత నిత్యాన్నదాన ట్రస్ట్ కు దాతలు ఆదివారం విరాళాలు అందజేశారని ఆలయ సహాయ కమిషనర్ సత్యనారాయణ తెలిపారు. విశాఖ వాసులు డాక్టర్ బడే నాగ సురేష్, డాక్టర్ క్రాంతి ప్రియ దంపతులు రూ.10,116, నిడదవోలు వాసులు కాపా రామకృష్ణ, విజయలక్ష్మి దంపతులు, చిరంజీవి భవ్య శ్రీ రూ.10 వేలు, కొత్తపేట వాసులు మల్లవరపు వెంకట సత్యనారాయణ సత్యవతి దంపతులు వారి కుటుంబ సభ్యులు రూ.10 వేలు విరాళాలు సమర్పించారన్నారు. అప్పనపల్లి వాసులు తటవర్తి లక్ష్మీనారాయణ వారి కుటుంబ సభ్యులు పద్మావతి అమ్మవారికి రూ.65 వేలు వ్యయం చేసే మామిడి పిందెల హారం సమర్పించారన్నారు. దాతల కుటుంబ సభ్యులకు స్వామి వారి చిత్రపటములు ప్రసాదములు అందజేశారు.

బుద్ధుని బోధనలు అనుసరణీయం

ప్రజాశక్తి - ముమ్మిడివరం

ప్రపంచానికి శాంతిని పంచిన బుద్ధుని బోధనలు అనుసరణీయమని బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా జాతీయ కార్యవర్గ సభ్యుడు ఎస్ఎస్ఆర్ భూపతి పేర్కొన్నారు. నగర పంచాయతీ పరిధిలోని స్థానిక అంబేద్కర్ కన్వెన్షన్ హాలు నందు ఆదివారం బిఎస్ఐ జిల్లా అధ్యక్షుడు పెనుమాల సుధీర్ అధ్యక్షతన శ్రావణ పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. అనంతరం జిల్లా బిఎస్ఐ నూతన్ కార్యవర్గ ఎన్నికలను నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా కెవివి సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా మాగాపు ఈశ్వర రావు, యలమంచిలి సురేష్‌లు, జనరల్ సెక్రటరీ గా బుడితి బాబు రాజేంద్ర ప్రసాద్, జెవివి సత్యనారాయణ, తరపట్ల వెంకటేశ్వరరావు, కోశాధికారిగా కెవివి సత్యనారాయణ కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు కార్యక్రమంలో చికురుమిల్లి చిరంజీవి, మట్టా ధన కాసులు, సఖిలే పథ్విరాజ్, నందికి ధనరాజు, పెట్టా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రత్నగిరికి బ్యాటరీ కారు బహూకరణ

ప్రజాశక్తి-శంఖవరం

అన్నవరం సత్యదేవుని సన్నిధికి వచ్చే వికలాంగులు, వయోవృద్ధులు, నడవలేని వారి కోసం దాత ఒకరు బ్యాటరీ కారును బహూకరించారు. కత్తెర రామారావు జ్ఞాపకార్థం వారి కుమారులు శ్రీనివాసరావు రూ.8 లక్షల విలువైన బ్యాటరీ కారును ఇఒ వీర్ల సుబ్బారావుకు కారు తాళాలను అందజేశారు. ఈ సందర్భంగా ఇఒ సుబ్బారావు దాత కుటుంబసభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో దాత కుటుంబికులు పాల్గొన్నారు.

రంగరాయ కళాశాల వాకింగ్ ట్రాక్ ప్రారంభం

ప్రజాశక్తి-కాకినాడ

రంగరాయ కళాశాలలోయ వాకింగ్ ట్రాక్‌ను రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు ఆదివారం ప్రారంభించారు. ఎంఎల్‌సిలు పేరాబత్తుల రాజశేఖర్, కర్రి పద్మశ్రీ, మాజీ ఎంఎల్ఎలు ఎస్‌విఎస్ఎన్.వర్మ, పిల్లి అనంతలక్ష్మి సత్య నారాయణమూర్తి దంపతులు హాజరయ్యారు. వీరికి సీనియర్ సిటిజన్స్, వాకర్స్, ఆర్ఎంసి ప్రిన్సిపల్ డాక్టర్ విష్ణువర్ధన్ ఘన స్వాగతం పలికారు. ఎంపీ సతీష్‌బాబు మాట్లాడుతూ వాకర్స్ అందరూ గ్రౌండ్‌ని చక్కగా వ్యాయామం కోసం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వాకర్స్‌కు ప్రత్యేకమైన ఐడి కార్డ్ ఇస్తారని, బయట వ్యక్తులకు ఈ గ్రౌండ్‌లో ప్రవేశం ఉండదన్నారు. సీనియర్ సిటిజన్స్, వాకర్స్ పాల్గొన్నారు.

సిఎం, డిప్యూటీ సిఎం చిత్రపటాలకు పాలాభిషేకం

ప్రజాశక్తి - సామర్లకోట

గీత కార్మికులకు, బిసిలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మద్యం షాపుల్లో 10 శాతం, బార్‌లో 10 శాతం వాటా కల్పిస్తూ టిడిపి బిసిల పార్టీ అని నిరూపించుకుందని రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్లు బడుగు శ్రీకాంత్, మట్టా ప్రకాశ్ గౌడ్, శెట్టి బలిజ కార్పొరేషన్ డైరెక్టర్ పెంకే వెంకటేష్ పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం బిసిలకు, గీత కార్మికులకు రాష్ట్ర వ్యాప్తంగా 84 బార్లకు కేటాయిస్తూ నిర్ణయం తీసుకోవడంపై ఆదివారం టిడిపి కార్యాలయంలో సిఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చిత్ర పటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిసి నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చంద్రబాబు, పవన్ కల్యాణ్ బడుగు, బలహీన, వెనకబడిన వర్గాల అభ్యున్నతికి పాలసీలు తీసుకుంటున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు విత్తనాల వెంకట రమణ, మట్టా మంగరాజు గౌడ్, తాతపూడి అరుణ్ వంశీ, పితాని సూర్యనారాయణ పాల్గొన్నారు.

హత్యల నిందితునికి కఠిన శిక్ష విధించాలి

ప్రజాశక్తి- సామర్లకోట

సామర్లకోట సీతారామ కాలనీలో మూడు హత్యల కేసులో అభం శుభం తెలియని చిన్నారులను క్రూరంగా హత్య చేసిన నిందితుడు సురేష్‌కు ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా కఠిన శిక్ష విధించాలని పలువురు ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం సీతారామ కాలనీ నుండి పోలీస్ స్టేషన్, మార్కెట్ మీదుగా బ్రౌన్‌పేట సెంటర్ వరకూ ర్యాలీ నిర్వహించారు. నిందితుని బెయిల్ రాకుండా న్యాయవాదులు సహకరించాలని కోరారు. బ్రౌన్‌పేట సెంటర్లో మానవహారం నిర్వహించి, కొవ్వొత్తులు వెలిగించి చిన్నారులకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జాతీయ కార్యదర్శి లింగం శివప్రసాద్, మానవ హక్కుల సంఘం నాయకులు నూతలపాటి అప్పలకొండ, దళిత సంక్షేమ సేన అధ్యక్షులు పిట్టా జానకి రామారావు పాల్గొన్నారు.

హసన్‌బాదలో జాతీయ జెండాలతో ర్యాలీ

ప్రజాశక్తి - రామచంద్రపురం

హసన్‌బాద గ్రామంలో సర్పంచ్ నాగిరెడ్డి సతీష్ రావు ఆధ్వర్యంలో ఆదివారం జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ నాగిరెడ్డి సతీష్ బాబు మాట్లాడుతూ భారత ఐక్యత చాటేలా , జాతీయవాదాన్ని పెంపొందించేందుకు ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతీ ఇంటిమీద జాతీయ జెండా ఎగుర వేయాలని జాతీయ జెండాల ర్యాలీతో ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రదర్శన నిర్వహించామని వివరించారు.

పట్ట పగలే వీధి దీపాలు

ప్రజాశక్తి - జగ్గంపేట

స్థానిక జగనన్న కాలనీలోని వీధి దీపాలు పట్టపగలు కూడా వెలుగుతూనే ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా విద్యుత్ ఎల్ఇడి వీధి దీపాలను ఏర్పాటు చేసింది. జగ్గంపేట శివారు జగనన్న కాలనీ, స్థానిక పుర వీధుల్లో విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. జగనన్న కాలనీలోని వీధి దీపాలు వేసి రెండేళ్లు పూర్తయ్యింది. అప్పటి నుంచి అవి రాత్రీ పగలూ వెలుగుతూనే ఉన్నాయి. వాటిని పగలు ఆఫ్ చేసేందుకు స్విచ్‌లే వేయకపోవడంతో అవి అలా వెలుగుతూనే ఉంటున్నాయని స్థానికులు చెబుతున్నారు. చాలా లైట్లు మరమ్మతులకు గురైనట్లు కాలనీ వాసులు పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వీధి దీపాలు రాత్రి సమయంలో మాత్రమే వెలిగేలా చూడాలని కోరుతున్నారు.